

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు విజ్ఞానం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. జిల్లా గ్రంథాలయం ఆధ్వర్యంలో మిట్టూరులో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రంథాలయ సంస్థ వేసవిలో విద్యార్థులకు సమ్మర్ క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయ సంస్థ ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపు ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఛైర్‌పర్సన్ మధుబాల పాల్గొన్నారు.



అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా వెల్ఫేర్ అసిస్టెంట్లు కృషి చేయాలని చిత్తూరు డిఆర్‌డిఎ పిడి తులసి పేర్కొన్నారు. సోమవారం డిఆర్‌డిఎ సమావేశం మందిరం లో వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెన్షన్లు, చేయూత, ఆసరా కళ్యాణమస్తు, షాది తోఫా, గహ నిర్మాణం తదితర అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఈ పథకాలకు అందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎవరెవరు ఏ పథకానికి అర్హులు అన్న విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేవిధంగా ఎప్పటికప్పుడు వాలం టీర్లతో సమాచారాన్ని సేకరించాలన్నారు. గ్రామ వార్డు సచివాలయానికి వచ్చే అర్జీలను కూడా పరిశీలించి తక్షణమే స్పందించాలన్నారు. ఈ విష యంగా ఎలాంటి ఫిర్యాదులు అందడానికి వీలు లేదన్నారు. సచివాల యాలకు వచ్చే ఫిర్యాదు దారులపై స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు. వచ్చిన ప్రతి వినతి ని పరిశీలించి ఎప్పటికప్పుడు వివిధ పథకాలకు అర్హులైన లబ్ధిదారుల వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. ఇందులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎపిడి రవికుమార్, డిఆర్‌డిఎ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ పిడి తులసి

'ఐసర్' వలస కార్మికులకు భద్రత కల్పించండి: సిఐటియు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఐసర్(ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) లో పనిచేస్తున్న భవన నిర్మాణ రంగ వలస కార్మికు లకు అన్ని రకాలుగా భద్రత కల్పించాలని సీఐట యూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య డిమాం డ్ చేశారు. ఐసర్ కార్మికుల పట్ల డీఈసీ కంపెనీ వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ సీఐటీయూ నా యకులు సోమవారం ఆర్డీవో రామారావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం పుల్లయ్య మాట్లా డుతూ ప్రతిష్టాత్మక ఐసర్ వద్ద డిఇసి కంపెనీ ఆధ్వర్యంలో సుమారు మూడు వేల మందికి పైగా ఒరిస్సా, మధ్యప్రదేశ్, బీహార్, చండీఘర్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన భవన నిర్మాణ రంగ వలస కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. అయితే కార్మికుల వివరాలు రెవెన్యూ అధికారుల వద్ద గానీ, అటు లేబర్ కార్యాల యంలో గానీ లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. వలస కార్మిక చట్టం ప్రకారం కార్మికులకు మౌలిక వసతులతో కూడిన నివాస ప్రాంతం, విద్య, వైద్య సదుపాయాలు కల్పించాల్సి ఉందన్నారు. కార్మికులను రేకుల షెడ్లలో నిర్బంధించి సదరు కంపెనీ కాంట్రాక్టర్ వెట్టిచాకిరి చేయించుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశువుల కొట్టం కన్నా దారుణంగా కార్మికుల నివాస ప్రాంతం ఉందన్నారు. కనీసం మరుగు లేక కాలకత్యాలు సైతం బహిరంగంగానే నిర్వహించుకో వాల్సిన దుస్థితి అక్కడ ఏర్పడిందని చెప్పారు. కార్మికులకు కనీసం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కంపెనీ కల్పించలేదని మండిపడ్డారు. కార్మికులకు సుస్తి చేసినా, ప్రమాదవశాత్తు మతి చెందినా విషయం బయటకు పోకుండా సెక్యూరిటీ సాయంతో నిర్బంధించి మరీ పనులు చేయించుకుంటున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా, అదనపు పనిగంటలు వలస కార్మికుల చేత చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఐసర్ వద్ద కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి వారికి అన్ని రకాలుగా భద్రత కల్పించాలని కోరారు. స్పందించిన ఆర్డీవో వలస కార్మికులకు అన్ని రకాలుగా హామీ ఇచ్చారు. సీఐటీయూ నాయకులు పెనగడం గురవయ్య, గంధం మణి, కుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

నగరంలోని సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్:

నగరంలోని ప్రధాన సమస్యలపై దష్టి పెట్టి వాటిని తక్షణమే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగ రాజు సోమవారం ఓ ప్రకటనలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టమంచి నుంచి కొంగారెడ్డిపల్లి రోడ్డు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారన్నారు. లారీలన్నీ ఈ రోడ్డుపై వెళ్లడంతో దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతు న్నారని తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని డిమాం డ్ చేశారు. అలాగే విద్యుత్తు శ్మశాన వాటికను పూర్తి చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. లెనిన్ నగర్‌లో ఉన్న డంపింగ్ యార్డ్ సమస్యలు కూడా పరిష్కారం చేయాలని, వర్షాలు పడుతుండటంతో దుర్వాసనతో చుట్టుపక్కల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. దోమలు బెడద ఎక్కువగా వుందని, పాగింగ్ అన్ని కాలనీలో చేయాలని కోరారు. చిత్తూరు అభివద్ధికి నిధులు కేటాయిస్తున్నప్పటికీ ప్రధానమైన మౌలిక వసతులు పూర్తి చేయకపోవడం ఏమిటి అని ప్రశ్నించారు. మహిళా కమిషనర్ చొరవ తీసుకుని కొన్ని కార్యక్రమాలు పూర్తి చేస్తున్నప్పటికీ ప్రధాన సమస్యలు అలాగే వుంటున్నాయన్నారు. ఇప్పటికైనా సమస్యలపై దష్టి పెట్టి పరిష్కరించాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు.

వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.500కు ఇవ్వాలి



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

రాష్ట్రంలో రెండు కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.500 కే వంట గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘాల తరపున డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ మహిళా సమాఖ్య చిత్తూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు యస్.జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి కె.విజయ్ గౌరిలు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థికంగా కంగిపోతున్నాయన్నారు. ముఖ్యంగా వంట గ్యాస్ సిలిండర్ ధర ఇప్పటికి 10 సార్లు పెంచడంతో రూ.1200 దాటింది. గతంలో గ్యాస్ సబ్సిడీ కింద సిలిండర్‌పై రూ.500 నుంచి 800 వరకు బ్యాంక్ అకౌంట్‌లో జమ చేసేవారని తెలిపారు. అయితే అది క్రమంగా తగ్గిస్తూ కేవలం రూ.12 అకౌంట్లో వేస్తున్నారని వాపోయారు. ఇలాంటి చౌకబారు ప్రభుత్వ విధానాలకు నిరసనగా మహిళా సమాఖ్య నిత్యం ఉద్యమిస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా నాయకులు కె రమాదేవి, ఎ జమీలవి పాల్గొన్నారు.

అక్రిడేషన్ల మంజూరులో నిబంధనలు సడలించాలి

చిత్తూరు అర్బన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని చిత్తూరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో కలెక్టర్ సగిలి షన్‌మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. సోమవారం చిత్తూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి అక్రిడేషన్‌ల మంజూరులో ఉన్న నిబంధనలు సడలించాలని, పాత్రికేయులందరికీ అక్రిడేషన్లు మంజూరయ్యేలా చూడాలని కలెక్టర్‌ను వారు కోరారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు లోకనాథం, అశోక్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ మీడియాకు జిల్లా కేంద్రంలో నాలుగు అదనపు అక్రిడేషన్లు మంజూరు చెయ్యాలని, న్యూస్ పేపర్స్‌కు సర్క్యులేషన్‌తో సంబంధం లేకుండా అక్రిడేషన్స్ ఇవ్వాలని, ఆర్‌ఎన్ఐ ఉన్న ప్రతి పత్రికకు గతంలో మాదిరి ఎలాంటి అభ్యంతరాలు లేకుండా అక్రిడేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందిస్తూ ప్రతి ఒక్కరికీ అక్రిడేషన్ ఇస్తామని ఇందులో ఎలాంటి సందేహం వద్దని, జర్నలిస్టుల ప్రధానమైన డిమాండ్లను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సంయుక్త కార్యదర్శి షకీల్, సభ్యులు శివ, చంద్ర, మనోహర్ రెడ్డి, మూర్తి, రమేష్ పాల్గొన్నారు.





డంపింగ్ యార్డ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని, ప్రస్తుతం చేస్తున్న వ్యవసాయాన్ని మరింతగా విస్తరించాలని మేయర్ ఎస్.అముద అధికారులను ఆదేశించారు. సోమవారం మేయర్ సంతపేటలోని నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్‌ను సందర్శించారు. యార్డులోని ఖాళీ స్థలంలో చేపడుతున్న సేంద్రియ వ్యవసాయ పంటలను, డంపింగ్ యార్డ్‌లో వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను పరిశీలించారు. కూరగాయల సాగును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యర్థాలతో రూపొందించిన వివిధ కళారూపాలను తిలకించారు. అనంతరం డంపింగ్ యార్డ్ నిర్వహణపై ప్రజారోగ్య అధికారి డాక్టర్ లోకేష్‌తో చర్చించారు. వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో 'స్పందన' వినతుల పరిష్కారం : కమిషనర్

'స్పందన' కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని నగర కమిషనర్ జె అరుణ సంబంధిత విభాగాల అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. గతవారం అందిన వినతులపై సమీక్ష నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో ఇంజినీరింగ్ 5, టౌన్ ప్లానింగ్ 3, రెవిన్యూ సెక్షన్-1, ఇతరములు-2 మొత్తం 11 వినతులు అందాయి. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డా.లోకేష్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భూములకు దారి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: తవణంపల్లి మండలం మారేడు పల్లి దళితుల భూములకు దారి కల్పించాలని సోమ వారం కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు సురేంద్రనాథ్ మాట్లా డుతూ గత 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న భూములకు దారి లేకుండా చేయడం చాలా దారుణం అన్నారు. సుమారు 20 మంది దళితులకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేశారని తెలిపారు. గత 50 సంవత్సరాలుగా ఉన్న దారిని మూసివేశారని మండల రెవెన్యూ అధికారులకు తెలిపినప్పటికీ పట్టించుకోలేదని ఆరోపణ చేశారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక పేదలను వేధించడం, వారి భూములు లాక్కోవడం, దారులు మూసేయడం పరిపాటిగా మారిపోయిందని దుయ్యపట్టారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి దళితులకు భూములు సాగు చేసుకోవడానికి దారి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కోశాధికారి విజయ్ కుమార్, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు దేవయాని పాల్గొన్నారు.



'స్పందన'కు 197 అర్జీలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం చిత్తూరు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ట్రైనీ కలెక్టర్ వై.మేఘ స్వరూప్, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌లతో కలిసి జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల అర్జీలను స్వీకరించారు. మొత్తం 197 అర్జీలు అందాయి.



చిత్తూరు అభివృద్ధిని పట్టించుకోరా..?

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:

పేరుకే.. జిల్లా కేంద్రం... ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు అభివృద్ధి మొత్తం తిరుపతి చుట్టూ కేంద్రీకరించబడింది. యూనివర్శిటీలు, పరిశ్రమలు, విమానాశ్రయాలు ఇలా అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితమైంది. జిల్లాల విభజన అనంతరం చిత్తూరు జిల్లాలో ఒక్క యూనివర్శిటీ కూడా లేదు. ఉన్న పరిశ్రమలు మూతపడ్డాయి. దీనికి తోడు అంతోఇంతో ఉపాధి కల్పిస్తున్న చిత్తూరు సహకార షుగర్ ఫ్యాక్టరీ విజయ సహకార డెయిరీ, న్యూట్రీన్ ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. దీంతో నిరుద్యోగం పెరిగి యువత ఉపాధి కోసం చెన్నై, బెంగళూరు వైపు పరుగులు తీయాల్సిన దుస్థితి ఏర్పడింది.

జిల్లాలోని చిత్తూరు కార్పొరేషన్‌లో తాగునీటి సమస్య కొరకరాని కొయ్యగా తయారైంది. ఏళ్ల తరబడి పాలకులు మారుతున్నా ప్రజల దాహార్తిని తీర్చే పరిస్థితి లేదు. ఎప్పుడో మున్సిపాలిటీ ఏర్పడిన నాటి డ్రైనేజీలే దిక్కు. వర్షం వచ్చిందంటే రోడ్లు అన్నీ చిత్తడిచిత్తడే.. వర్షపునీరు మురుగునీటితో కలిసి రోడ్లపై ప్రవహిస్తుంది. దాదాపు 60కి పైగా ఉన్న మురికివాడల్లో మౌలిక వసతులు అంతంతమాత్రమే.. ఇక విద్య, వైద్యం కోసం అయితే చెన్నై, బెంగళూరు నగరాలకు పరుగులు తీయాల్సిందే.. ఇలాంటి పరిస్థితుల్లో చిత్తూరు జిల్లా అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చరిత్ర గల జిల్లాలో అన్ని సమస్యలే...

1911, ఏప్రిల్ 1వ తేదీన తమిళనాడులోని పాత ఉత్తర ఆర్కాట్ జిల్లా నుండి చిత్తూరు, పలమనేరు, చంద్రగిరి తాలూకా, కడప జిల్లాలోని మదనపల్లె, వాయల్పాడు తాలుకాలు, పుంగనూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు, పాత కారవేటి నగర ఎస్టేట్‌లోని మాజీ జమిందారీ ప్రాంతాలతో చిత్తూరు జిల్లా కేంద్రంగా ఏర్పాటు అయింది. 1985లో చిత్తూరు జిల్లాలో 66 మండలాలు ఉండేవి. 2022, ఏప్రిల్ 4న ఉమ్మడి చిత్తూరు జిల్లా నుండి తిరుపతి, అన్నమయ్య జిల్లాలు ఏర్పడ్డాయి. జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరం ఆంధ్రప్రదేశ్‌కు దక్షిణాన, పెన్నానది లోయలో, బెంగళూర్-చెన్నై రహదారి మీద ఉంది. ఇది ద్రవిడప్రాంతం. ఇక్కడ తెలుగు, తమిళ భాషలు మాట్లాడుతారు.

చెరకు, మామిడి, వేరుశనగలకు వ్యాపార కేంద్రం..



ఆర్థికంగా చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేవు గాని వాణిజ్యపంటలకు మార్కెట్ యార్డు ఉంది. నగరంలోని వ్యాపారులు బెంగళూర్, చెన్నైకు దగ్గరగా ఉన్నందున ఎగుమతి దిగుమతులు జరుగుతూ ఉంటాయి. బెల్లం, మామిడి కాయల ఎగుమతికి చిత్తూరు పేరుగా చింది. 2012లో చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌గా ఏర్పడింది. 2011 జనాభా ప్రకారం 1,75,647ఉంది. ప్రస్తుతం 2,03,625గా ఉండి 50 డివిజన్‌లతో కార్పొరేషన్ పాలన సాగుతోంది.

చిత్తూరుకు సంబంధించి పేరుప్రఖ్యాతులు గాంచిన కట్టమంచి రామలింగారెడ్డి, చిత్తూరు నాగయ్య, పెరియంబాడి చిన్నమరెడ్డిలు ఉన్న విషయం అందరికి తెలిసినదే. 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని' అన్న చందంగా చిత్తూరు నగర అభివద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్టుగా ఉంది.

చతికిల్లాబడ్డ సహకార రంగం..

సహకార రంగంలోని విజయా పాల డెయిరీ, చక్కెర ఫ్యాక్టరీలు మూతపడ్డాయి. సహకార రంగంలో దేశంలోనే పేరు ప్రతిష్టలు కలిగిన చిత్తూరు విజయా డైయిరీ 2002 ఆగస్టు 31న మూతపడింది. దాదాపు రూ.1000కోట్ల ఆస్తులున్న విజయా డెయిరీని 99 ఏళ్లకు గుజరాత్‌కు చెందిన అమూల్‌కి లీజుకిస్తూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయం చేసింది. 600 మంది ఉద్యోగులు, లక్ష మంది పాడిరైతులతో మహావట వృక్షమై విస్తరించిన డెయిరీ ప్రస్తుతం మొండి గోడలతో పూర్వవైభవాన్ని కోల్పోయానని రోదిస్తోంది. అమూల్ చేసిన పుణ్యం ఏమి విజయా డెయిరీ చేసిన పాప ఏమిటని పాలకులను మౌనంగా ప్రశ్నిస్తున్నది.

1964లో సహకార రంగంలో ప్రారంభమైన చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీకి నష్టాలు వస్తున్నాయనే పేరుతో చంద్రబాబు హయాంలో అమ్మకానికి పెడితే రైతులు హైకోర్టుకు వెళ్లి ఫ్యాక్టరీ మూతపడకుండా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. చక్కెర ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైన నిధులు ఇవ్వకుండా దొడ్డిదారిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పచెప్పాలనే ఆనాటి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు చేసిన ఆందోళనలను ఆనాటి ప్రభుత్వం లెక్క చేయక పోవడంతో ఫ్యాక్టరీ శాశ్వతంగా మూతపడింది. ఫ్యాక్టరీ మీద ఆధారపడిన రైతులు, కార్మికుల గోడును ఎవరూ పట్టించుకోలేదు.

1964లో సహకార రంగంలో ప్రారంభమై 16వేల మంది రైతులతో నడిచిన చక్కెర ఫ్యాక్టరీ 2015లో మూతపడింది. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం వచ్చిన 6నెలల్లోనే మూతపడ్డ చిత్తూరు సహకార చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరణ చేస్తానని అప్పటి ప్రతిపక్ష నేతగా జగన్మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా హామీ ఇచ్చారు. తీరా అధికారంలోకి రాగానే ఆమాట మరిచారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డెప్ప 2020, సెప్టెంబర్ 14నజరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామని, పునరుద్ధరణకు సమగ్ర నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రికి అందచేస్తామని చెప్పిన విషయం రెడ్డెప్పకి గుర్తు ఉండేఉంటుంది. ఫ్యాక్టరీని తెరిపించే ఉద్దేశ్యం ఉందా.. లేదా..? అని పాలకులే చెప్పాలి.

చిత్తూరు అభివృద్ధికి పక్కాప్రణాళికను పాలకులు, అధికారులు పరస్పర ఉమ్మడి అవగాహనతో రూపొందించాలి. చిత్తూరు నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని, జీవన ప్రమాణాలను పెంచడానికి పాలకులు, అధికారులు ఇచ్చిన హామీలు, ఫైల్స్ దుమ్ము దులిపి ఆచరణలో అమల్లోకి తీసుకొస్తే నగర ప్రజలు జేజేలు పలుకుతారు. చిత్తూరుకు తెలుగు గంగ అడవిపల్లి రిజ్వాయర్‌ల నుంచి నీరు ఎప్పుడు వస్తుంది. చిత్తూరు సమీపంలోని కలవగుంట గ్రామంలో ఎన్టీఆర్ జలాశయం చిత్తూరు నగరానికి ప్రధాన నీటి వనరు. 1995- 96లో ఈ జలాశయానికి 56 కోట్లు అంచనా వ్యయంతో ప్రారంభించిన ఈ ప్రాజెక్టుకు నిధులు సరిగ్గా లేకపోవడంతో నగర ప్రజలు



తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి తెలుగుగంగ నుంచి రెండు టిఎంసిల నీరు తెచ్చి నగర ప్రజలను ఆదుకొంటామని ఇచ్చిన హామీ నెరవేరలేదు కదా రోజురోజుకీ నీటిని కొనే పరిస్థితి దాపురించింది. ఎన్టీఆర్ జలాశయాన్ని అభివృద్ధి చేస్తామని డిప్యూటీ సిఎం 2020, నవంబర్ 28న కార్వేటినగరంలో జరిగిన సమావేశంలో ప్రకటించారు. అయితే ఇప్పటికీ దాని ఊసే లేదు.

అడవిపల్లి రిజర్వాయర్ ఎప్పటికి పూర్తయ్యేనో....

అమృత్ నిధులు నుంచి రూ.276కోట్ల వ్యయంతో అడవిపల్లి రిజర్వాయర్ నుంచి చిత్తూరు నగర ప్రజల తాగునీరు అవసరాలు తీరుస్తానని, అడవిపల్లి ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాడానికి ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని టెండర్లు కూడా పిలవాలని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు 2023, మార్చి 13న విలేకరుల సమావేశంలో చెప్పిన విషయం పత్రికల్లో వచ్చింది. అయితే నేటికీ ఈ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి.

అపోలో ఆసుపత్రి తీరు మారదా...

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో అపోలో సంస్థ విలీనం కావడంతో ఆసుపత్రిలో పడకలస్థాయి 300 నుంచి 850కి పెరిగింది. వైద్యసేవల నిమిత్తం రోజుకి కనీసం 1800 నుండి 2000మంది రోగులు వస్తారు. కనీసం 600మంది ఇన్ పేషంట్స్ వుంటారు. ఇంతటి సామర్థ్యం ఉన్న ఆసుపత్రిలో అధికారుల నిర్లక్ష్యం వల్ల రోగులకు తిప్పలు తప్పడం లేదు. అరకొర పరిశుభ్రత. ప్రసూతి విభాగంలో పుట్టినబిడ్డలను అసలు తల్లికి తెలియకుండా ఇంకోకరికి ఇచ్చేసిన ఘటనలు ఇటీవల చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సకాలంలో వైద్యం అందక చనిపోయిన ఘటనలపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. బిడ్డలను పోగొట్టుకున్న తల్లుల బాధలు ఇంతా అంతా కాదు. బాధితులు గొడవలు చేసినప్పుడే అధికారులు చేసిన తప్పులు సరిదిద్దుకొంటున్నారు. ప్రతి చిన్న జబ్బుకు చికిత్స చేయడానికి బయటి ప్రాంత ఆసుపత్రులకు రెఫర్ చేయడం అపోలో అధికారులకు సర్వసాధారణం అయ్యింది. అత్యవసర మందులను బయట కొనుక్కోండి అని మొహమాటం లేకుండా చెపుతున్నారు. పేరుకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ.. వీరు ఉన్నా లెనట్లే. సమావేశాలు జరుగుతున్నాయని భ్రమలు ఉన్నాయి. లెనిన్ నగర్‌లోని మునిసిపల్ డంపింగ్ యార్డు వల్ల అక్కడి స్థానికులు రోగాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై మునిసిపల్ అధికారులుకు ఎన్నిసార్లూ మొరపెట్టుకున్నప్పటికి పట్టించుకున్న నాధుడే లేడు.. నీవా నది మురికిగుంటగా మారింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ఆరోగ్య హక్కు, అత్యవసరమైన వైద్య సదుపాయాలు పొందే హక్కు, ప్రభుత్వ ఆస్పత్రిలో సకాలంలో వైద్యం పొందే హక్కు, నీటి కాలుష్యం నివారణ హక్కులు ప్రాథమిక హక్కులుగా చేర్చబడ్డాయి. ఈ హక్కులను ప్రాథమిక హక్కుల గుండెగా సుప్రీంకోర్టు అభివర్ణించింది. ఈ హక్కులు అధికారులకు సహితం తెలుసు.

జిల్లాల విభజన తరువాత చిత్తూరు పూర్తిగా వ్యవసాయ ఆధారిత జిల్లాగా మారింది. ఉమ్మడిజిల్లాలో చిత్తూరు నగరం అభివృద్ధి చెందలేదు. దీంతో విభజన తర్వాత చిత్తూరు నగరం మళ్లీ వెనుకుబాటిలోకి వెళ్ళిపోయింది. జిల్లాలో ముగ్గురు మంత్రివర్గం లో ఉన్నారనే సంతప్తి తప్పా అభివృద్ధి ఆనవాళ్లు కనిపించడం లేదు. జిల్లా కేంద్రం చిత్తూరు అభివృద్ధికి రాజకీయలను పక్కన పెట్టి ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధ వహించాలి. పాలకుల నిర్లక్ష్యానికి గురైన మన చిత్తూరు అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా కృషిచేయాల్సిన బాధ్యత నగర ప్రజలపై ఉంది. అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలి.

పి.చైతన్య, కన్వీనర్ మన చిత్తూరు అభివృద్ధి వేదిక
9490300770

వైసీపీ గెలిస్తే సంక్షేమం... టిడిపి వస్తే సంక్షోభం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: రానున్న ఎన్నికల్లో వైసీపీ మళ్ళీ అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, టిడిపి అధికారంలోకి వస్తే సంక్షోభం ఎదురవుతుందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పేర్కొన్నారు. సోమవారం గంగాధర నెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీలో ఎన్. లక్ష్మిరెడ్డి పల్లి, అసలాపురం, కొత్తూరు, కొత్తూరు ఆదిఆంధ్రవాడల్లో డిప్యూటీ సీఎం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టి ప్రజల వద్ద ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరిందా లేదా లబ్ధి చేరకుండా ఉంటే ఎందువల్ల మీకు ఆ పథకాలు అందలేదని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో టిడిపి నేతలు ప్రోద్బలంతోనే తాను గడపగడపకు వెళ్ళినప్పుడు కావాల్సిగానే అడ్డుకొని రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, ఎంపీపీ అనిత, నెల్లెపల్లి సర్పంచ్ రవీంద్రారెడ్డి, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వెంకటరెడ్డి, రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన

ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని తిప్పినాయుడు పల్లి గ్రామంలో 'కంపు భరించలేకపోతున్నాం' శీర్షికన వార్త సోమవారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీఓ సుధాకర్ రావు తమ సిబ్బందితో ఆ గ్రామానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న డంపింగ్ యార్డ్‌ను పరిశీలించి పై స్థాయి జిల్లా అధికారులకు నివేదిక పంపించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రజాశక్తి విలేకరితో మాట్లాడుతూ అక్కడ ఉన్న డంపింగ్ యార్డ్‌లో నిల్వ ఉన్న చెత్త కుళ్ళి కంపు వస్తున్న మాట వాస్తవమే. రిపోర్టును జిల్లా కలెక్టర్‌కు రాసి పంపించామన్నారు. ఆర్డర్ వచ్చిన వెంటనే డంపింగ్ యార్డ్‌ను వేరే చోటకు మారుస్తాం అని తెలిపారు. సర్పంచ్, స్థానికులు ప్రజాశక్తికి అభినందనలు తెలిపారు.

కంటి చికిత్సకు 30 మంది ఎంపిక



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: కంటి చికిత్సకు 30 మంది ఎంపికైనట్టు చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ నిర్వాహకులు మురళి అన్నారు. సోమవారం మండల అభివద్ధి కార్యాలయంలో శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ శిబిరంలో 52 మంది కంటి పరీక్షలు చేసుకోగా, 30 మందికి కంటి చికిత్స చేయాలని గుర్తించి వారికి చెన్నై శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్‌లో ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్టు, వీరికి పోను, రాను ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గ్రామీణులకు కంటి సమస్యలు లేకుండా చూడాలన్నదే శంకర్ నేత్రాలయ మిషన్ ఫర్ విజన్ ధ్యేయమన్నారు.

గృహనిర్మాణ లబ్ధిదారులతో సమీక్ష



ప్రజాశక్తి-సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులతో ఉపాధి హామీ జేఈ రెడ్డప్ప సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ సామూహిక గృహప్రవేశాలు ఉన్నందున లబ్ధిదారులు నిర్మాణాలను వేగవంతం చేసి 20వ తేదీకి గృహప్రవేశాలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని లబ్ధిదారులను కోరారు. దీంతో 21 మంది సామూహిక గృహప్రవేశాల రోజు ఇంటి నిర్మాణాలను పూర్తిచేసుకుని గహప్రవేశాలు చేస్తామని తెలియజేయడంతో ఆయన వారిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి భాష మసూద్, పంచాయతీ కార్యదర్శి జయశంకర్, వీఆర్‌ఓ, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా అర్జున తపస్సు

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ కొత్తపల్లి మిట్ట గ్రామంలో వెలిసిన శ్రీ ద్రౌపతి ధర్మరాజు ఆలయ ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం నిర్వహిస్తున్న సందర్భంగా సోమవారం అర్జున తపస్సు కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. తయ్యూరు, కొత్తపల్లి, కొటార్లపల్లి, బసవరెడ్డిపల్లి, చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం అర్చకులు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. అర్జున వేషధారి పద్యాలు పాడుతూ తపస్సు మాను ఎక్కారు. ఆయన విసిరిన విభూది నిమ్మకాయల కోసం భక్తులు ఎగబడ్డారు. పలువురు మహిళలు సంతానం కలగాలంటే తపస్సు మాను వద్ద వరపడ్డారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నాగరాజు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్అదాలత్

ప్రజాశక్తి-నగరి: ఈనెల 13వ తేదీన జాతీయ లోక్అదాలత్ జరగనుందని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నగరి జూనియర్ సివిల్ జడ్జ్ వి గోపాలకష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు రాజీ చేసుకోవచ్చని, రాజీకి లోబడిన అన్ని క్రిమినల్ కేసులు కూడా రాజీ చేసుకోవచ్చన్నారు. దీంతో కాలం, ధనం ఆదా అవుతుందని, లోక్అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మల్లేశ్వరికి పిహెచ్‌డి ప్రదానం



ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో పరిశోధన చేస్తున్న బియ్యం మల్లేశ్వరికి పిహెచ్‌డి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు వర్శిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.పి. నాగేశ్వరరావు తెలిపారు. ప్రసారాంగ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఎం.హరికష్ణ పరిశోధనా పర్యవేక్షణలో "అంతటి నరసింహం రచనలు-సామాజిక విశ్లేషణ" అన్న అంశంపై సమర్పించిన పరిశోధనా సిద్ధాంత గ్రంథానికి మల్లేశ్వరికి పిహెచ్‌డి డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు.

11వ రోజుకు చేరిన సమ్మె



ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయ తాత్కాలిక ఉద్యోగులు చేపడుతున్న సమ్మె 11వ రోజుకి చేరుకుంది. సోమవారం భారతీయ జనతా పార్టీ నాయకులు చిట్టిబాబు, రాంప్రసాద్, శివశంకర్, ఇతర సభ్యులు సమ్మె శిబిరానికి చేరుకొని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బిజేపీ నాయకులు మాట్లాడుతూ 11 రోజులుగా చేస్తున్న సమ్మెపై ఉద్యోగులకు ఖచ్చితమైన హామీ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు, ప్రభుత్వం పై విమర్శలు చేశారు. వెంటనే వారికి చెల్లించాల్సిన న్యాయమైన జీతాలు, అరియర్స్ చెల్లించాలని కోరారు. అలాగే వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈ సమస్యపై పార్టీ తరపున విశేష కషి చేస్తామని హామీ ఇచ్చారు.

దళితుని మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలి



ప్రజాశక్తి-పలమనేరు: దళితుని మృతికి కారణమైన ఎర్రినాగేపల్లి అగ్రకుల పెత్తందారులను వెంటనే అరెస్ట్ చేయాలని జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలాయుధం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పట్టణంలోని మానవ హక్కుల కార్యాలయంలో వి.కోట మండలం తోట కనుమ పంచాయతీ మోర్నపల్లి గ్రామ బాధితులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ జల్లికట్టు కార్యక్రమంలో దళితుడైన శ్రీనివాసులు ఎద్దు పొడిచి చనిపోయాడని పోలీసులు కేసు నమోదు చేశారే గాని అందుకు బాధ్యులైన వారిని అరెస్టు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి నెల 7వ తేదీ 2023 న వి.కోట మండలం ఎర్రి నాగేపల్లి గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా జల్లికట్టు నిర్వహించారని, దాన్ని చూడడానికి తోట కణం పంచాయతీ మోర్నపల్లికి చెందిన దళిత శ్రీనివాసులు వెళ్లి ఎద్దు దాడిలో గాయపడి మృతి చెందడం బాధాకరమన్నారు. అనుమతులు లేని జల్లికట్టు వ్యవహారంలో పోలీసులు ఏడు మంది గ్రామస్తులను బాధ్యులు చేస్తూ కేసు నమోదు చేశారే కానీ ఇంతవరకు అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. దళితులు ఏదైనా తప్పు చేస్తే ఎక్కడ దాక్కున్న వెంటాడి పట్టి జైలుకు పంపించే పోలీసు అధికారులు అనధికారికంగా చేసిన జల్లికట్టులో దళితుడు చనిపోతే ఎందుకు అగ్రకుల పెత్తందార్లను ఇంతవరకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో ఏ రాజకీయ శక్తులు ఉన్నా పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దళిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మానవ హక్కుల నాయకులు పార్థసారథి, వినోద్, గంగప్ప, సుబ్రహ్మణ్యం, శ్యామల, రత్నప్ప, పొన్ను స్వామి, బాధితులు గణేష్, వేణుగోపాల్, కదిరప్ప, చెంగప్ప, భూలక్ష్మి, పాల్గొన్నారు.

టీటీడీ అన్నదాన సేవకు కూరగాయల వితరణ



ప్రజాశక్తి-శాంతిపురం: ప్రముఖ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానానికి మండల జిల్లా పరిషత్ సభ్యులు ఎస్ శ్రీనివాసులు, వారి సహచర బందం సోమవారం సుమారు 10 టన్నుల కూరగాయలు వితరణగా అందించారు. ఈ సందర్భంగా వారు పాత్రికేయులతో మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి అన్నదాన కార్యక్రమానికి అందిస్తున్న ఈ కూరగాయల వితరణ ద్వారా ఆ శ్రీనివాసుడి కరుణ, కటాక్షాలు రాష్ట్ర ప్రజలకు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. వెంకటేశ్వర స్వామి సేవకులుగా ప్రతి సంవత్సరం తాము ఈ దైవ కార్యక్రమానికి పూనుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పిటిసిని, వారి మిత్రబందాన్ని ఎంపీపీ కే వసుంధర కోదండ రెడ్డి అభినందించారు. ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్న సేవకులందరికీ అన్న ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో మాజీ రెస్కో అధ్యక్షులు చక్రపాణి రెడ్డి, మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ టీవీ పట్టాభి, రాష్ట్ర వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నాగభూషణమ్మ సుబ్బరాజు, విశాలాక్షి సుకుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఎం సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.

'టిడిపి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి'



ప్రజాశక్తి-రామకుప్పం: తెలుగుదేశం పార్టీ హయాంలో చేపట్టిన అభివద్ధి, సంక్షేమాలను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలని చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు మునస్వామి, మాజీ ఎంపిపి ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ముద్దనపల్లి గ్రామపంచాయతీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో గడిచిన నాలుగు సంవత్సరాలలో అభివద్ధి కుంటుపడిందని, అరాచకాలు, అక్రమాలు, అక్రమ కేసులు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు విసిగిపోయారన్నారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీతో చంద్రబాబు నాయుడుని గెలిపించాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా వ్యతిరేక విధానాలను, ధరల పెంపు తదితర వాటిపై వివరించాలన్నారు. ఏకతాటిపై తెలుగుదేశం పార్టీ గెలుపునకు ఇప్పటినుంచే బలోపేతం చేయాలని పిలుపునిస్తూ, పార్టీలో కష్టపడిన కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో నేతలు చిన్నకష్ణ, సీతాపతి, గంట్లప్ప గౌడు, గజేంద్ర, వెంకటరమణ, మనోహర్, చంద్రశేఖర్, టీవీ రవి, రఘు, మురళి, బాలరాజు, నాగరాజు, సుబ్రహ్మణ్యం, వెంకట్రామిరెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



ప్రజాశక్తి-కార్వేటినగరం: కార్వేటినగరంలో వేసవి శిక్షణా శిబిరాన్ని మండల ఎంపీపీ లతబాలాజీ, స్థానిక సర్పంచ్ ఎం. ధనంజయ వర్మ, సింగిల్ విండో ప్రెసిడెంట్ లోకనాథ్ రెడ్డిలు సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ లత బాలాజీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంపును ఉపయోగించుకోవాలని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి నాడు-నేడులో భాగంగా బడులను అభివృద్ధి చేశారని, చదువుకొనుటకు అన్ని సౌకర్యాలు కల్పించనున్నారన్నారు. గ్రంథాలయంలో పుస్తకాలు, ఫర్నీచర్, బిల్డింగు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇప్పుడు వేసవి శిక్షణ శిబిరంలో గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీష్, కథలు, యోగ, ధ్యానం, ఆటలు, పాటలు, క్రాఫ్ట్, డ్యాన్సులు, ఆధ్యాత్మిక విషయాలు, చెస్, క్యారమ్స్ మొదలగునవి నేర్పించడం చాలా గొప్ప కార్యక్రమం అని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, గ్రంథాలయ అధికారి శంకర్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంగవరం: మండలం శాఖ గ్రంథాలయ ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ శిబిరం ఎంపీడీఓ శివప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరశురామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం జూన్ 11వ తేదీ వరకు నిర్వహించబడునని, ఇందులో శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రధానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి, పాఠకులు పాల్గొన్నారు.



ఆలయంలో దళితులకు అవకాశం కల్పించాలని వినతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకష్ణాపురం గ్రామంలోని పోలాక్షమ్మ ఆలయంలో దళితులు పూజల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షులు మహేష్ కోరారు. ఈ మేరకు సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కొన్నేళ్లుగా గ్రామంలో నివసిస్తున్న దళితులకు ఆలయంలో ప్రవేశం ఇస్తున్నారే తప్ప.. పూజలో పాల్గొనడానికి అగ్రవర్ణాల వారు నిరాకరిస్తున్నారని.. తమకు పూజల్లో పాల్గొనేలా పెద్దలకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దళితులు పూజా కార్యక్రమాలు చేయరాదని గ్రామంలోని పలువురు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ పుత్తూరు తహశీల్దారుకు ఫోన్‌లో మాట్లాడి దళితులు పోలాక్షమ్మ ఆలయంలో పూజలు చేసుకునేలా అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు చక్రపాణి , గజపతి, మనోహర్, చంద్ర , మునెయ్య, లోకేష్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు

ప్రజాశక్తి-నగరి: ఈ నెల 13 నుంచి జూన్ 2 వ తేదీ వరకు నగరిలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీదేవి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వినికా సంస్థ ప్రతినిధి యాదగిరి ఆధ్వర్యంలో ప్రతి యేటా ఇలాంటి తరగతులను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ శిక్షణా తరగతులను ఎస్‌జీఎన్ బాలికల పాఠశాలలో నిర్వహించనున్నారన్నారు. వివరాలకు నెం. 9394566440ను సంప్రదించాలని సూచించారు.

రాబోయేది మన ప్రభుత్వమే

మాజీ జడ్పిటిసి బెటప్ప నాయుడు



ప్రజాశక్తి-గుడిపల్లి: రాబోయే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమని మాజీ జడ్పిటిసి బెటప్ప నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని కనమపల్లి గ్రామపంచాయతీలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పిటిసి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్క తెలుగుదేశం కార్యకర్త అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కషి చేయాలని తెలిపారు. రాష్ట్రంలో అభివద్ధి జరగాలంటే తెలుగుదేశం పార్టీ కచ్చితంగా రావాలన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటపొలాలను ధ్వంసం చేసిన ఏనుగులు



ప్రజాశక్తి-పులిచెర్ల: మండలంలోని పాతపేట పంచాయతీలో సోమవారం వేకువజామున ఏనుగుల గుంపు మామిడి, చెరుకు తదితర పంటలను ధ్వంసం చేశాయి. పంటలను ధ్వంసం చేయడమే కాక పైపులను నాశనం చేశాయి. పాతపేటకు చెందిన వెంకటేష్, చిన్నస్వామి, వెంకటరమణ తదితరుల చెరుకుతోటను ధ్వంసం చేయడంతో పాటు మామిడిచెట్లను విరిచేశాయని వాపోయారు. ఉదయం పంట పొలాల వద్దకు వెళ్లిన రైతులకు ఏనుగుల గుంపు సంచరించి పంటలను ధ్వంసం చేసిన దశ్యాలను ఆ రైతులు చూసి ఆందోళన చెందారు. సుమారు 6 ఏనుగుల గుంపు వ్యవసాయ పొలాలను ధ్వంసం చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయని రైతులు వాపోయారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించామని వారు తెలిపారు.

కుశస్థలి వరదలో ఇరుక్కుపోయిన ట్రాక్టర్



ప్రజాశక్తి-నగరి: ఆదివారం కురిసిన వర్షానికి మండలంలోని తేరని సమీపంలో వున్న కుశస్థలి నదిలో సోమవారం అక్రమ ఇసుకాసురులు ఇసుక తీసుకువేళ్ళేందుకు ట్రాక్టర్‌లో వచ్చారు. ఆ నది వరద నీటిలో ట్రాక్టర్ చిక్కుకుంది. దీంతో ట్రాక్టర్‌ను జెసిబి సహాయంతో వెలికి తీశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుకాసురులను అరికట్టాలని తేరని గ్రామస్తులు కోరారు.

బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-పులిచెర్ల: మండల వ్యవసాయాధికారిగా ఎంఆర్ శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అనంతపురం జిల్లా వజ్రకరూర్ మండల ఏఓగా పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఇక్కడికి వచ్చారు. సదుం మండలం ఏఓగా పనిచేస్తున్న హరిప్రసాద్ ఇప్పటివరకు పులిచెర్ల ఏఓగా పనిచేశారు. ఈ సందర్భంగా ఏఓ శ్రీనివాసులు మాట్లాడుతూ వ్యవసాయ రంగం అభివద్ధికి కషి చేస్తానని, రైతులు సహకరించాలని తెలిపారు.

ఉద్యాన పంటల పరిశీలన



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి మిరప రైతులు కొంతవరకు నష్టపోయారు. చేతికందే సమయంలో వర్షానికి పంట నేలపాలైంది. సూళ్లూరుపేట ఇన్‌ఛార్జి ఉద్యానశాఖ అధికారిణి శారద సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ, కుకుంబాకం, వెస్టత్తూరు, కారణమెట్ట గ్రామాలను సందర్శించారు. ఇందులో భాగంగా కల్లాల్లో తడిచిపోయిన మిరప పంటను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి శారదతో పాటు వీహెచ్‌ఏ భరత్, వీఏఏ లావణ్య, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో భారతి తెలిపారు. సోమవారం బుచ్చినాయుడుకండ్రిగ రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 45 కేజీల బస్తా ధర రూ.266.50 లకు రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది భరత్, కుమార్, లావణ్య, రేవతి పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన కట్ట దంపతులు



ప్రజాశక్తి-నాయుడుపేట: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని కట్ట దంపతులు సోమవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డి ఆయన సతీమణి నాయుడుపేట జడ్పీటీసీ కట్ట. జ్యోతి రెడ్డి లు మంత్రిని కలిసి నాయుడుపేట లోని స్థానిక, నియోజకవర్గ సమస్యలను తెలియజేశారు మంత్రి గోవర్ధన్ రెడ్డి వీరి చెప్పిన సమస్యలను పరిశీలించి తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని సామరస్యంగా స్పందించినట్లు కట్ట దంపతులు తెలిపారు. వీరితో పాటు నల్లు.కస్తురియ్య మంత్రిని కలిశారు.

రచయిత్రికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: స్థానిక భాకరాపేటకు చెందిన రచయిత్రి ఉషారాణి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకొన్నారు. తిరుపతి యూత్ హాస్టల్‌లో జరిగిన ఎన్టీఆర్ శత వసంత వేడుకల్లో ఈ జాతీయ పురస్కారాన్ని సుబ్బారాయుడు, స్పెషల్ జ్యుడిషియల్ తులసి నెహ్రూ, సంఘ సేవకురాలు గుత్తా హరిసర్వోత్తమనాయుడు, శ్రీశ్రీ వేదిక రాష్ట్ర అధ్యక్షులు అతిథి చేతుల మీదుగా అందుకున్నారు. సాహిత్య సేవా రంగంలో చేసిన సేవలకు గాను ఎన్టీఆర్ జాతీయ పురస్కారం తనకు లభించినట్టు ధనాశి ఉషారాణి తెలిపారు.

తప్పుడు రికార్డులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాశక్తి- తిరుపతి అర్బన్: తిరుపతి రూరల్ దామినేడు లెక్కదాఖల్లోని సర్వేనంబరు 38/3కు సంబంధించి భూ కబ్జాదారులు కొందరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తప్పుడు రికార్డులు సష్టించి హైకోర్టు ను సైతం తప్పుదారి పట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డిని, తిరుపతి రూరల్ తహశీల్దారును సీపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి పి.వెంకటరత్నం కోరారు. సోమవారం తిరుపతి రూరల్ తహశీల్దార్ కార్యాలయం వద్ద రామిశెట్టి వెంకటస్వామి వద్ద భూములు కొని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిశేషు, నాయకులు మహేష్, ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా కోశాధికారి కుడం విజయకుమార్, తిరుపతి ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్, నాయకులు మునికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్త మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తడుకు పంచాయతీ తిరుమలరాజు కండ్రిగకు చెందిన వైసీపీ కార్యకర్త హేమాద్రిరాజు గుండె నొప్పితో బాధపడుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా సోదరులు కుమారస్వామిరెడ్డి భౌతిక కాయానికి పూలమాల వేసే నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ ఆనంగి హరి, నాయకులు కొండేటి నాని, ప్రభురాజు, యాదల బాబు, మధురాజు, కొండేటి దాము పాల్గొన్నారు.

భూహక్కు-భూరక్ష రీసర్వేకు సహకరించాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు 'వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకం' కింద రాష్ట్ర వ్యాప్తంగా రీ సర్వే కార్యక్రమం జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి తెలిపారు. పుత్తూరు పురపాలక సంఘ పరిధిలో సోమవారం ఉదయం స్థానిక యస్.ఆర్.యస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో డ్రోన్ సాయంతో సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులపాటు పట్టణంలోని 27 వార్డుల పరిధిలో సర్వే జరుగుతుందని, పట్టణ ప్రజలు అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ హరి, వైస్‌ఛైర్మన్ శంకర్, జయప్రకాశ్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.